వారం వారం కథాప్రభ

# కులభోజరాజు సింహాసనం

గోపరాజు నాగేశ్వరరావు

**మలిసంధ్య సూర్యుడు పడమటి ఆకాశపుటంచుల్ని అరుణార్ణవం చేస్తున్నాడు. బంగారం రంగులో ప్రకృతి జాజ్వల్యమానంగా ప్రకాశిస్తోంది. పొలాలనుంచి ఇళ్లకు తిరిగి వస్తున్న గేదెల వెంటే పేతురు కూడా వస్తున్నాడు.**

ఊరి బయట ఉన్న మాదిగపల్లె దాపుకు రాగానే ఒక్క క్షణం తన గుడిసెకు వెళ్లి ముఖంమీద కాసిని చన్నీళ్లు చల్లుకుని సేదదీరి వెళ్లాలనిపించి గొడ్లను అదిలించాడు పేతురు.

అవ్వన్నీ నిర్వికారంగా నెమరువేస్తూ అలవాటుపడ్డ దారివెంటే పిచ్చిరెడ్డి కొట్టంవేపుకు సాగిపోతున్నాయి.

అసలే నడిపి ఎండాకాలం! పగలంతా పొలం దగ్గర గొడ్లకు కావలి కాసి ఎండకు పేతురు శరీరం ఎంతగా సొక్కిపోయిందో! గుడిసెకు వెళ్లి హడావుడిగా రెండు చెంబుల నీళ్లతో ముఖం, కాళ్లూ చేతులూ కడుక్కుని క్షణం సేదదీరి మళ్లీ యధావిధిగా దొరగారింటికి బయల్దేరాడు.

మాదిగపల్లె దాటి మరికొంచెం దూరం నడిచాడు.

పిచ్చిరెడ్డి దొర ఇల్లు దాపుకు వస్తున్నకొద్దీ పేతురు గుండె మరింత వేగంగా కొట్టుకోసాగింది.

"ఛూత్! నీయమ్మ!" దొరగారి గండిగేదె గుర్తొచ్చి ఆ మాటలు పైకే అనకుండా ఉండలేకపోయాడు పేతురు.

ఆ గండిగేదె చేసిన నిర్వాకానికి దొరగారితో తనకీరోజు మూడిందే! 'కొరడా దెబ్బలు తప్పేదెట్లా?' అన్న ఆలోచనతో పేతురు మనసంతా వికలమైపోయింది.

దొరగారి కొట్టానికి వచ్చాడు పేతురు. ఇంకా అతనికి ఎంత పనుందో! గేదెల్ని నీళ్లతో కడిగి శుభ్రంగా స్నానం చేయించాలి. మేతకు దంట్లు నరికి గాళ్లలో వెయ్యాలి. నీళ్లలో తవుడు కలిపి గాబుల నిండా కుడితి నింపాలి.

గేదెలు దంట్లు నములుతూ, నెమరేస్తూ, మళ్లీ నములుతూ, మళ్లీ మళ్లీ నెమరేస్తుంటే చేతులతో వాటి వీపీమీద 'ఆప్యాయంగా' నిమిరి అవ్వేవో తమకంలోకి కూరుకునిపోగానే అప్పుడు వాటి పొదుగుల్ని పితకాలి.

మరి, పాలకుండలు నిండాలంటే మనిషికి ఆపాటి సహనం, లౌక్యం అవసరం కదా! లేకుంటే అవ్వెంత బలంగా తంతాయో!


గేదెల కొట్టంలో ఒంగేడు పేతురు. పశువుల మధ్య బొంగరంలా తిరుగుతూ యాంత్రికంగానే తన పని తాను చేసుకుపోతున్నాడు.


పిచ్చిరెడ్డి దొర ఇంకా ఇంటికి వచ్చినట్టు లేదు. లేకుంటే ఈపాటికల్లా వాకిట్లో కొరడా చేతపట్టుకుని తనకోసం సిద్ధంగా ఉండేవాడే!

"ఛూత్, నీయమ్మ!" అని మళ్లీ గండి గేదెను తిట్టి ఎందుకో ఉలిక్కిపడి వీధి వాకిలివైపు చూశాడు పేతురు.

'కిర్రు'మని తెరుచుకున్న తలుపుల మధ్య నుంచి కొంచెం ఆలస్యంగా కొట్టానికొచ్చిన దొరగారి గండి గేదె మందగమనంతో హుందాగా లోపలికొచ్చింది.

కోపం పట్టలేక గేదెవైపు కొరకొరా చూశాడు





పేతురు. అసంకల్పంగానే పళ్లు కొరికాడు.

అయినా కోపం చల్లార్తేనా?

"ధూత్, నీయమ్మ! ఎండపాటుకు ప్రేణం అన్నుబట్టి సెట్టుకింద ఛణంసేపు తొంగుంటే ఆ ఛణాన్నే దొరోరి పాటిసేలో బడి సేనంతా కళ్లం జేస్తావే, నీయమ్మ!" అని, కోపంతో ఊగిపోతూ కొట్టం గుంజకు ఆన్చిపెట్టిన ముల్లుగర్రందుకుని కసిదీరా గఁవిడి గేదెను బాదేందుకు ముందుకు వెళ్లాడు పేతురు.

అయినా, దొరగారి గఁవిడి గేదెను కొట్టేందుకు పేతురుకు ఎంత సాహసం కావాలి! పొలం దగ్గరే దాన్ని కొట్టాలనుకున్నా అలంటి సాహసం లేకనే కదా ఆ ప్రయత్నం విరమించుకుంది.

తరతరాలుగా నిస్సహాయతలోంచి మనుగడ కోసం నరాల్లో జీర్ణించుకున్న బానిసత్వం పేతుర్ని వారించిందేమో, ఎత్తిన ముల్లుగర్ర కిందికి దించేశాడు పేతురు.

"అరేయ్! పేతురుగా!" అక్కడికి ఎప్పుడు వచ్చాడో కానీ పిచ్చిరెడ్డి దొర గొంతు మేఘాలు రాపిడి పడ్డట్టే ఉరుములా వినిపించింది.

పేతురు గుండె ఝల్లుమంది.

పిచ్చిరెడ్డి దొరకు ఉప్పెవరందించారో కానీ, వచ్చీ రాగానే చింతనిప్పుల్లాంటి కళ్లను మరింతగా విప్పారుస్తూ -

"... ఇంట్లోకెళ్లి అమ్మనడిగి నా కొరడా తెచ్చుకో! నీకో నాలుగిచ్చుకుంటాను. పాటి సేనెవ్వారం నాకు తెలవదా ఏంట్రా?" అన్నాడు దొర.

రెక్కలు తెగిన గువ్వలా దొరగారి కాళ్లమీదికి 'దబ్బు'న ఒరిగిపోతూ, "దొరా! తఁవర్నాకు సిచ్చెయ్యండి. అయినా పెట్టే సెయ్యి గొడితే మాత్తరం తప్పేటి? తప్పంతా నిజ్జానికి నాదే! ఇసప్పురు గసుమంటోణ్ణి. యిస్వాసం లేనోణ్ణి. గేదెల్ని గాయంరా ... అంటే మదమెక్కి నిద్రోయినోణ్ణి. ఎంత తఁవరి మనసు యన్నపూ సనుమంటిదైనా నే నైసిన నేరానికి తఁవరికి కోపం రాదా ఏంటి!" అని దొరగారి ఇంటివేపుకు ఒకటిన్నర అడుంగులేసి, ఆగి - "దొరా! మర్సేపోయాను. తఁవరికే గాదు, తఁవరి కొరడా గ్గూడా ఓ సెరిత్రుంది!" అన్నాడు పేతురు మెరుపు కళ్లతో.

పిచ్చిరెడ్డి దొర ఆలోచనలో పడ్డాడు. ఆ ఆలోచనంతా ఓ కొలిక్కొచ్చేసరికల్లా వారి చింతనిప్పుల కళ్లు తెలిమబ్బులయ్యాయి.

"నా కొరడా క్కూడా సెరిత్రుందా?" అడిగారు ఆశ్చర్యంగా.

## సిల్లీ సర్వే!



**అటెన్షన్ భార్యలూ:** *మీ భర్తతో రతి, లేదా ఆయన అంట్లగిన్నెలు తోమడం - ఈ రెంటిలో మీ కేది కావాలంటే మీ రేం కోరుకుంటారు?*

మనదేశంలో ఏమోగానీ, అమెరికాలోని అయిదు పెద్ద నగరాల్లో వందమంది స్త్రీ(భార్య)లను అడిగితే 79 శాతంమంది తమకి భర్తతో రతికన్నా, ఆయనగారు సింక్‌లోని అంట్లగిన్నెలు తోమడం ముఖ్యం అన్నారు.

**ఓర్లెండోలోని ఓ భార్య సమాధానం** - *"ట్రాఫిక్ లైట్లు మారడం చూడటంలో ఎంత ఎక్సైట్‌మెంట్ ఉంటుందో నా భర్తతో అందులోకూడా అంతే ఎక్సైట్‌మెంట్ ఉంటుంది. నో, థాంక్స్! గిన్నెలు తోమమనండి, చాలు!"*

**ఫిలడెల్ఫియాలోని బెట్టి అనే ఆవిడ ఇలా చెప్పింది :** *"గత 27 ఏళ్లుగా నేను పొందిన సుఖం చాలు! గిన్నెలు తోమమంటాను."*

**న్యూయార్క్‌లోని మార్గరెట్-** *"ఆ నాన్సెన్స్‌కన్నా నాకు వంటగదిలో సహాయం బెటర్!" అంటోంది.*

**లాస్ ఏంజెలస్‌కి చెందిన డయాంగ్ ఈ ప్రశ్నకి సమాధానంగా** - *"నాకా ఛాయిస్ ఉంటే మా డిష్ వాషర్‌ని అమ్మేస్తాను!" అన్నది నవ్వుతూ.*

**శాన్‌ఫ్రాన్సిస్కో నివాసి మేరియన్ నవ్వుతూ** - *"కనీసం ఆ పనయినా (గిన్నెలు తోమడం) ఆయన సక్రమంగా చేస్తే నా ఓటు దానికే!"*

- ఎం. లిపి

పేతురు లేడిపిల్లలా ఒక్క దూకు దూకి పరుగు పరుగున వెళ్లాడు. వరండాలో ఉన్న ధొరగారి వాలు కుర్చీని అమాంతం భుజంమీది కెత్తుకుని అంతే వేగంతో వెనక్కొచ్చాడు. దొర పక్కనే కుర్చీ వేసి, "ఉఫ్!" అని కుర్చీ పట్టామీది దుమ్ము దులిపి -

"తఁవరింక యిస్రాంతిగా కుర్చీలో గూకోండి. ఇప్పుడు జోస్తా సెరిత్రంతా!" అన్నాడు వినయంగా.

ఒక్క క్షణం తటపటాయించి, ఆ తర్వాత కుర్చీలో తాపీగా కూర్చొని, "ఆఁ... కూకున్నాను గాని, ఇంక నువ్వెళ్లి కొరడా దెచ్చుకో!" అన్నాడు దొర మరింత తాపీగా.

దొరలా కొరడా ప్రసక్తి మళ్లీ తెచ్చినా పీతురేం బెదర్లేదు. కించిత్తు కంగారైనా పళ్లేదు.

పెద్ద కుక్క దాడి చేస్తే బుజ్జికుక్క దాని కాళ్లముందు వెల్లికితలాపడి గారాలు పోతుంది. తోక కదుపుతూ మూలుగుతుంది. పూర్తిగా లొంగిపోయినట్లు నటిస్తుంది. ప్రమాదం తప్పించుకుందుకు అలాంటి లౌక్యం అప్పుడు దాని తక్షణావసరం. కాలగమనంలో బుజ్జికుక్క పెద్దదయ్యాక అదీ అలాగే బుజ్జి కుక్కల్ని వేధిస్తుంది. అల్పులు తమ మనుగడకోసం అధికుల అహాన్ని సంతృప్తి పరచటం, తమలో గుప్తంగా దాగి ఉన్న తమ అహాన్ని సంతృప్తి పరుచుకునే అవకాశాలకోసం ఆశగా, ఓర్పుగా నిరీక్షించటం జీవన సూత్రం! అలాంటి జీవన సూత్రానికి జంతువులే కాదు, మనుషులూ బద్ధులే!

పేతురు మరింత వినయంగా దొరవారి పాదాల దగ్గర ముడుక్కుంటూ -

"దొరా! కొరడా దెచ్చేంతదాకా తఁవరు కోపం పట్టలేకపోతే ఆలీసెం లేకుండా తఁవర్నన్ను కాళ్లతో దన్నండి. సేతుల్తో గొట్టండి. తఁవరు కాళ్లతో దన్నినా, సేతుల్తో గొట్టినా సెరిత్ర జెప్పందే నేనీడ్నించి కదల్ను! ఆ సెరిత్రేటంటే, తఁవరి తాతగారైన పోల్రెడ్డి దొరోర్ది గూడా తఁవర్లాగనే యన్నంటి మనసు!అయినా సిమ్మం కడుపున సిమ్మం గాక మరేం బుట్టుద్ది? అట్టాగే తఁవరి ముత్తాతగారికి తఁవరి తాతగారు పుట్టారు. నాకు మా అయ్య జెప్పాడు; ఓపాలి పోల్రెడ్డి దొరకు కోపం వచ్చి మా అయ్యను యిదే కొరడాతో కొడితే మా అయ్యకు యీపంతా తోల్లేసి నద్దబూర్లా వాసిందంట. మరి బయ్యానికో, దెబ్బలకో గాని ఆ రేత్తిరంతా మా అయ్యకు జొరం కాస్తే, పొద్దుగాలే దొర లెగిసి, ముందు గోలీ మింగిచ్చి, మా అయ్య వనంటుకొనేదాకా దొర వచ్చి పాలైనా ముట్టుకోలేదంట..."

"ఎట్టా ...?" కుర్చీలో సర్దు క్కూచుంటూ మధ్యలోనే దీర్ఘం తీశాడు దొర. మరింత ఆసక్తిగా పేతురు చెప్పేది వినేందుకు సిద్ధపడుతూ లాల్చీ జేబులోంచి క్రికెట్టు బంతంత పుగాకు బంతిని బయటికి తీసి, దాన్నుంచో కాడ లాగి, బంతిని మళ్లీ జేబులో వేసుకుని, పుగాక్కాడను పాయలుగా చీల్చి, చుట్ట చుట్టుకుని నిప్పెట్టెతో అంటించి, వాలు కుర్చీకి చేరగిలబడుతూ -

"అద్సరేలేవో ... మా అయ్యేసుమంటోడంటావ్?" అడిగాడు పిచ్చిరెడ్డి దొర గుప్పు గుప్పున పొగూత్తూ.

"మరి సిమ్మం కడుపున సిమ్మం బుడితే పులి కడుపున ఏం బుట్టుద్ది?" అని అడిగి, "పులే బుట్టుద్ది!" అని తనే సమాధానం చెప్పి, "తఁవర్నాన్నగారైన పెంటారెడ్డి దొరది కూడా తఁవర్లాగానే యన్నంటి మనసు! పైగా, వారైతే మడుసుల్నే కాదు, పసరాల్ని గూడా ప్రేణంగా జూసేవోరు. ఒకపాలేమైందో తెల్సా .... దొరగారి పదేల్రూపాయల పందెపు కోడెను పురుగు ముట్టింది. అది సావుబతుకుల్లో వుంటే పట్నం నించల్లా పశువుల డాకటేర్ని రప్పిచ్చి, యిండీసన్లు బొడిపిచ్చి, దాన్ని బతికిచ్చారు దొర ..."

పేతురు చెప్పిందంతా విని పిచ్చిరెడ్డి దొర సహం కాలిన చుట్టను దూరంగా విసిరికొట్టి, కుడి చేత్తో మీసాలు దువ్వుకున్నారు. ముసిముసిగా నవ్వుకున్నారు. మరంతలోనే ఏం గుర్తొచ్చిందో కానీ గంభీరంగా శూన్యంలోకి చూస్తూ ఒక్క క్షణం తీవ్రంగా ఆలోచించి నొసలు చిట్లించాడు. అనుమానంగా పేతురు వైపు చూస్తూ,

"ఇంతకూ మా అయ్య పెంటారెడ్డి దొర సిమ్మం అంటావా? పులంటావా?" అని అడిగాడు గంభీరంగా.

పేతురు చిరుకోపంతో దొర వైపు చూస్తూ అన్నాడు - "పులి పులే! అయినా పులి గ్గూడా యాడుంటుంది ఆ దొరకున్న దయిర్నం!" అని.

పిచ్చిరెడ్డి మళ్లీ ఆలోచనలో పడ్డాడు. జేబులోంచి పుగాకు బంతిని బయటికి తీసి ఇంకో చుట్ట

చుట్టుకుంటూ పరీక్షగా పేతురి వైపే చూస్తూ కూర్చున్నాడు.

పేతురు కళ్లన్నీ పుగాకుమీదే!

పిచ్చి రెడ్డి దొర చుట్ట అంటించకుండానే చుట్ట కొసను వేళ్లతో సుతారంగా నలుపుతూ ఎంత ఆలోచించినా తన అనుమానం నివృత్తి కాక, "పేతురుగా! నువ్వ జెప్పిందే నిజ్జం అయితే మరి మా తాత సిమ్మం అన్నావు గదా ఆయనకు బుట్టిన మా అయ్య పులెట్టాగౌతాడూ?" అని అడిగాడు తల ఎగరేస్తూ.

"ఓ... అదా తఁవరి అనుమానం! అడివిని పాలిచ్చేవి సిమ్మాలూ, పులులే. సిమ్మానికి పులి బుట్టిందా? పులికి సిమ్మం బుట్టిందా అన్న దీడ ప్రెశ్నే గాదు. ఉన్న ప్రెశ్నెల్లా పుట్టినోడు పెత్తనం జెయ్యగలోడా? లేడా? అన్నది మాత్రమే. ఇక మీకాడికొస్తే తఁవరూ సెబ్బాస్ రాజానే! తఁవరూ బెబ్బులి పులే! సేత్తో కొరడా పట్టుకొని తఁవరు ఒక గట్టుమీన సిమ్మంలాగా, మరో గట్టుమీన పుల్లాగా తిరుగుతుంటే పొలంలో పన్జేసే కూలోళ్లు పొద్దుగాల వొంచిన నడుం ఎత్తేదింక పొద్దుమింకే! అలగా జనానికి అట్టాగే బయ్యం పెట్టాలి. వాళ్ల కా బయ్యం బెట్టకపోతే రాజు లేని రాజ్జం జేస్తారు ...'

అప్పుడు పెద్దగా నవ్వారు పిచ్చిరెడ్డి దొర.

"సుట్ట గాలుత్తావా ఏంట్రా పేతురుగా?" అని అడిగారు పుగాకు బంతివైపే చూస్తున్న పేతుర్ని ఉద్దేశిస్తూ.

తలూపాడు పేతురు వినయంగా.

భళ్లున నవ్వి, "కూటికి లేన్నాయాల! నీకూ గావాల్నంట్రా పుగాకు?" అని అభిమానంగా చూస్తూ పేతురు ముఖంమీదికి పుగాక్కాడను విసిరేశాడు దొర. దా న్నందుకున్నాడు పేతురు.

అప్పుడు దొర కళ్లలో అహం సంతృప్తి పడ్డ ఆనందం తాలూకు ఎంత మెరుపు మెరిసిందో!

కుర్చీలోంచి పైకి లేచి, "అరేయ్, పేతురుగా! సుట్ట గాలిత్తే గాల్చవ్ గానీ కొంచెం అట్లా సాటుకెళ్లి గాల్చి సావు!" అని గోముగా పేతుర్ని మందలింపు ధోరణిలో హెచ్చరించి, ఏదో గుర్తొచ్చినట్టే ఆగి, "ఇంటికి బోతూ అమ్మ నడిగి అన్నం, కూర పట్టుకెళ్లు!" అని చెప్పి వెళ్లిపోయాడు దొర.

దొర అలా వెళ్లాడో, లేదో తాపీగా కూర్చుని పెద్ద చుట్ట చుట్టుకుని తృప్తిదీరా తాగాలనుకున్నాడు పేతురు. మళ్లీ ఆలోచించాడు. పుగాక్కాడను రెండు పాయలుగా చీల్చి రాత్రికి అన్నం తినగానే కాల్చేందుకు సహం పాయను బొడ్లో దోపుకుని మిగిలిన సహంపాయతో చిన్న చుట్ట చుట్టుకుని అప్పటికి దాంతో సరి పుచ్చుకున్నాడు.

* * *

ఆ రాత్రి -

దొర కొరడా దెబ్బలు తప్పినందుకు ఆనందపడుతూ అన్నం తినగానే తన గుడిసె ముందున్న మట్టి అరుగుమీద కూర్చున్నాడు పేతురు.

చుక్కల చీరగట్టిన నీలాకాశం నుంచి అర్ధచంద్రుడు వెన్నెల్ని పొదుపుగా కుమ్మరిస్తున్నాడు.

మరియమ్మ కూడా గుడిసె బయటికి వచ్చి భర్త పక్కనే అరుగుమీద కూర్చుని, "ఊళ్లోకి డెక్కలో డొచ్చిండంట!" అంది పేతురుతో.

"వొచ్చాడా? మరాడికి కాస్తయినా వణ్ణం, కూర ఉంచావా?" అడిగాడు పేతురు.

"ఉంచా?" అంది మరియమ్మ.

పేతురు ఆలోచనలో పడ్డాడు - డెక్కలోడ్ని గురించే! మాదిగ కులానికి ఉపజాతిగా సంచార జీవనం సాగించే డెక్కలోళ్లు మాదిగ కులస్థుల ఇళ్లలో తప్ప మరెవ్వరి దగ్గరా అన్నం అడుక్కోరు.

మరియమ్మ ఎందుకో లోపలికి వెళ్లిపోయింది. రెండు నిమిషాల తర్వాత దూరంగా వీధి కుక్కల అరుపులు వినిపించాయి. ఆలోచనల నుంచి తేరుకుని తలెత్తి చూశాడు పేతురు.

"తల్లే ...! కబళం తల్లే!" గుడిసె ముందు నిలబడి అరిచాడు అప్పుడే వచ్చిన డెక్కలోడు.

"మరియా! డెక్కలోడొచ్చాడు, వణ్ణం పెట్టు!' ' గుడిసెలో ఉన్న మరియమ్మకు వినిపించేట్టు కేకేశాడు పేతురు - పుగాకును బయటికి తీస్తూ.

మరియమ్మ బయటికొచ్చింది. సత్తు గిన్నెలోంచి అన్నం, కూర డెక్కలోడి జోలె సంచిలోకి ఒంపింది.

"ఏరా డెక్కలోడా! ఏంటి సంగతులు?" అడిగాడు పేతురు.

"ఏం లెవ్వు దొరా!"

"ఈతాకుల సాపల్జేసి అమ్ముతున్నావా? లేదా?"

"చేసే పని అదేగా దొరా!" అన్నాడు డెక్కలోడు.

"పనదేలేవో ... అయినా నీ యవ్వారం నాకు తెలీదా ఏంటి. సాపల్జెయ్యకుండా సోమరిగా అడుక్కుంటే నీ కన్నం పెట్టొద్దని అమ్మకు జెప్తా, జాగర్త!" డెక్కలోడ్ని హెచ్చరించాడు పేతురు.

"తఁవర్జెప్పినట్టే సాపల్జేస్తా న్దొరా!"

పేతురు వాడివేపు ప్రసన్నంగా చూశాడు. ఏం గుర్తొచ్చిందో కానీ, "సుట్ట గాలుత్తావా ఏంట్రా, డెక్కలోడా!" అని అడిగాడు.

తలూపాడు డెక్కలోడు వినయంగా.

భళ్లున నవ్వి, "కూటికి లేన్నాయాల, నీకూ గావాల్నంట్రా పుగాకు?" అని అభిమానంగా చూస్తూ డెక్కలోడి ముఖంమీదికి దాచుకున్న పుగాకు విసిరేశాడు పేతురు. దా న్నందుకున్నాడు డెక్కలోడు.

పేతురు కళ్లతో అహం సంతృప్తి పడ్డ ఆనందం తాలూకు ఎంత మెరుపు మెరిసిందో, పిచ్చిరెడ్డి కళ్లలో అప్పుడు మెరిసిన మెరుపుకుమల్లేనే!

అరుగుమీంచి పైకి లేచి, "అరేయ్, డెక్కలోడా! సుట్ట గాలిత్తే గాల్చావ్ కానీ, కొంచెం అట్లా సాటుకెళ్లి గాల్చి సావు!" అని మందలింపు ధోరణిలో గోముగా డెక్కలోడ్ని హెచ్చరించి, ఏదో గుర్తొచ్చినట్లే ఆగి, "రేపూ వొచ్చి అమ్మనడిగి వణ్ణం, కూరా ఎత్తకపో!" అని చెప్పి ఠీవిగా నడుస్తూ గుడిసెలోకి వెళ్లిపోయాడు పేతురు.

